# కేంద్ర నిర్ణయం సరికాదు

**బోర్డు సీఈఓకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే లాస్యనందిత**



బోర్డు సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లాస్యనందిత, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్‌లు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 21: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజలపై నీటిపన్ను వేస్తే సహించేది లేదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత తెల్చిచెప్పారు. సామాన్య ప్రజలపై భారం వేసే ఏ నిర్ణయాన్ని కూడా ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్ నాయక్‌ను బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్‌లతో కలిసి నీటిపన్నుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే లాస్యనందిత వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నివసిస్తున్న ప్రజలపై నీటి పన్ను విధించాలన్న నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు సాయి కిరణ్, కిరణ్, సతీశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### పుష్పగుచ్ఛం అందజేసి..



ఇటీవల సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుభాష్‌రావు బుధవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

*- ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 21*

### యువజన సమ్మేళనానికి తరలిరండి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 21: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న వరంగల్‌లో జరిగే యువజన సమ్మేళనానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్ బుధవారం పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ యువతను మోసం చేశారని విమర్శించారు.

### ఫుట్‌పాత్‌పై దుకాణాల తొలగింపు..

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 21: ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారులు ఆక్రమించుకొని వ్యాపారం చేస్తున్నారు. రోడ్లపై వాహనాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న క్రమంలో పాదచారులు రహదారులపై నడవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బుధవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పలు వ్యాపార దుకాణాలను తొలగించారు.



ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లాస్యనందిత

### వార్డులో సమస్యలు లేకుండా కృషి చేస్తా..

**ఎమ్మెల్యే లాస్యనందిత**

బొల్లారం, ఫిబ్రవరి 21: నియోజకవర్గంలో సమస్యలు లేకుండా కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అన్నారు. బుధవారం మూడో వార్డులో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మడ్‌ఫోర్ట్ గాంధీనగర్‌లో దక్షిణ కాళీమాత ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా నీటి పైపులైన్,కొత్త బోర్‌వెల్ పనులను పరిశీలించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి బస్తీ, కాలనీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### డ్రైఫ్రూట్స్ అలంకరణలో.. అమ్మవారు



సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో బుధవారం రెండో రోజు కోటి కుంకుమార్చన పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో అమ్మవారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. ఈ నెల 24 వరకు ఈ కోటి కుంకుమార్చన పూజలు కొనసాగుతాయని ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు.

*- బేగంపేట్, ఫిబ్రవరి 21*

## యువత మత్తుకు చిత్తు కాకుండా..



డాస్ ఎక్స్‌పోర్ట్స్ షార్ట్ ఫిల్మ్‌ను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 21:నేటి యువత మత్తుకు చిత్తు కావద్దని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం ప్రసాద్ పిలుపునిచ్చారు.మంగళవారం రాత్రి సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బీదల బస్తీలో గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అలాగే స్థానిక యువకులు నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని,జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. మత్తు సేవించకూడదని షార్ట్ ఫిల్మ్ షూటింగ్ ప్రారంభించారు.స్థానిక నాయకుడు గడ్డంప్రసాద్‌తో పాటు గంగపుత్ర సంఘం నాయకులు మల్లేష్,శ్రీనులు క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.... నేటి యువకులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వక్తం చేశారు. ఇలాంటి షార్ట్ ఫిలిమ్‌లను తీస్తూ యువతను చైతన్య పరుస్తున్న డైరెక్టర్ సందిరి భానుచందర్, హీరో దగ్గుల సుమన్, చిన్నా, మధు, కెమెరామెన్ దగ్గుల తరుణ్,వంశీ,రామ్‌లను అభినందించారు. బస్తీలు ,కాలనీలలో యువత మత్తు సేవించవద్దని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### ఎన్నికలకు సహకరించాలి

బండ్లగూడ, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జ రిగేలా రాజకీయ నాయకులు సహకరించాలని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆర్డీఓ.. వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

### సమ్మక్క - సారలమ్మకు ఘనంగా పూజలు



బోయిగూడలోని సమ్మక్క - సారక్క దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 21 : న్యూబోయిగూడలోని సమ్మక్క, సారలమ్మ దేవాలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే మేడారంలో అమ్మవార్లు వనం నుంచి గద్దెలపై కొలువుదీరి, భక్తులకు దర్శనం ఇచ్చాక, తిరిగి వనప్రవేశం జరిగే వరకు ఇక్కడ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నదని నిర్వాహకులు మక్కల కుమార్, ప్రమీల, సంజీవ్‌లు తెలిపారు. అమ్మవార్లకు బంగారం సమర్పించి, కల్లు సాకపోసి, కొత్త దుస్తులు సమర్పించి, ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## సమాజాన్ని చైతన్యపరిచిన వైతాళికుడు వట్టికోట

**పాత్రికేయుడు వేణుగోపాల్**



డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వట్టికోట ఆళ్వార్‌స్వామి స్మారకోపన్యాసంలో పాల్గొన్న జర్నలిస్ట్ వేణుగోపాల్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 21: తెలంగాణ ప్రజా సాహిత్యకులు, గ్రంథాలయోద్యమ నాయకుడు, ఉద్యమకర్త వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో స్మారకోపన్యాసం నిర్వహించారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎన్.వేణుగోపాల్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 'వట్టికోట ఆళ్వార్‌స్వామి- గ్రంథాలయోద్యమం' అనే అంశంపై ప్రసంగిస్తూ .. తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయోద్యమాన్ని ఉవ్వెత్తున నడిపిన వైతాళికుడిగా పేరు పొందిన వట్టికోట ఆళ్వార్‌స్వామి సమాజంలో చైతన్యం నింపారన్నారు. భూస్వాముల పెత్తనం కింద నలిగిపోతున్న తెలంగాణను విముక్తిచేయడం సామాజిక బాధ్యతగా గుర్తించారని, అనేక గ్రంథాలయాలను ఏర్పాటు చేయించి మారుమూల ప్రాంతాల్లో సైతం అభ్యుదయ కిరణాలు వ్యాపింపజేశారని పేర్కొన్నారు. తెలంగాణ యాసకు తన రచనల్లో పెద్దపీట వేశారని, ఆయన రచనలు నేటి తెలంగాణకు దిశా నిర్దేశం చేసేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.సీతారామారావు, రిజిస్ట్రార్ ప్రొ.ఏవీఆర్‌ఎన్.రెడ్డి, లైబ్రరీ ఇన్‌చార్జి డా.ఎన్.రజిని తదితరులు పాల్గొన్నారు.

### పద్మశాలి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గౌతమ్‌కుమార్

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 21: తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరాల గౌతమ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం నారాయణగూడలోని పద్మశాలిభవన్‌లో గౌతమ్‌కుమార్‌కు అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పద్మశాలి యువతను ఐక్యం చేసి ప్రభుత్వ పరంగా వచ్చే హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం 31న బహిరంగ సభ



పికెట్‌లోని పార్కులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు..

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 21: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యం చేయడం కోసం మార్చి 31న సికింద్రాబాద్ హరిహర కళా భవన్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెషన్, బయోడిజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ పికెట్ పార్కులో ఆ సంస్థ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కాలుష్యంతో పర్యావరణం కలుషితమై మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రస్తుత పర్యావరణంపై ప్రభుత్వానికి ఒక నివేదిక ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గందమల్ల యాదయ్య, ప్రతినిధులు మోత్కూరు మల్లేష్, కేబీ నర్సింగ్‌రావు, సి. అప్పారావు, బి. లక్ష్మణ్‌రావు, పి.శామ్యూల్. ఎం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### కుల గణన చేపట్టాలి

కాచిగూడ, ఫిబ్రవరి 21: బీసీల భావితరాల కోసం కేంద్ర ప్రభుత్వం జనాభా గణనలో భాగంగా కుల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. బుధవారం కాచిగూడ లో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఏండ్లు గడిచినప్పటికీ బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. కేంద్రం కుల గణన చేపట్టడం ద్వారా ఆయా కులాల ఆర్థిక, సామాజిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయన్నారు. కులగణన చేయకపోతే కేంద్రంపై బీసీల తిరుగుబాటు తప్పదన్నారు. బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలం చెందిందని, దేశ ప్రజలు బీజేపీని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని ఆయన హెచ్చరించారు.

## అవార్డులు అందుకున్న సామాజిక కార్యకర్తలు



వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహనీయుల అవార్డ్స్ మహోత్సవం 2024ను పురస్కరించుకొని పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారికి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డులను అందజేశారు. దానిలో భాగంగా అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన సమ్మయ్య, శివలింగం, రమేష్, గాదె మల్లేష్, ప్రభాకర్, భాగ్యలక్ష్మి, ఎ.సువర్ణ, శ్యామల, జమున, లక్ష్మి, ప్రవీణ్, సుమలత తదితరులు అవార్డులు అందుకున్నారు.

*- అడ్డగుట్ట, ఫిబ్రవరి 21*

### మాదిగజాతిపై సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష

**జై భీం యూత్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్**

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): మాదిగ జాతిపై సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని జై భీం యూత్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు నడిమిదొడ్డి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దీనికి కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజికవర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, కేవలం పాలకుల పాలనే అని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంపై పదే పదే ఆరోపణలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. మాదిగ జాతిపై కాంగ్రెస్ పార్టీ చూపుతున్న వివక్షపై త్వరలో రాష్ట్రంలోని దళిత సంఘాలతో సమావేశమై ఐక్య కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వాకర్స్‌కు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 21: ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు జి. రామన్‌గౌడ్ కోరారు. కామినేని దవాఖాన వారి ఆధ్వర్యంలో బుధవారం నారాయణగూడలోని మెల్కోటే పార్కు ఆవరణలో వాకర్స్‌కు ఉచితంగా వైద్యశిబిరం ఏర్పాటు చేయగా.. ఆయన దానిని ప్రారంభించారు. 185 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామినేని దవాఖాన వైద్యుడు అనురాగ్,పార్కు అధ్యక్షుడు భూషణ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్, జక్కి, అభిషేక్ రెడ్డి పాల్గొన్నారు.

# కంటోన్మెంట్‌కు నిధుల కొరత

- టీపీటీ ఛార్జీలు రాష్ట్ర సర్కారు చెల్లించేనా?
- రూ.50 కోట్ల మేర బోర్డుకు రావాల్సిన బకాయిలు
- లేఖలు రాసినా స్పందించని సర్కారు



కంటోన్మెంట్, ఫిబ్రవరి 21: సికింద్రాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ బోర్డుకు నిధులు లేక అభివృద్ధి నానాటికీ కుంటుపడుతోంది. రక్షణ శాఖ సర్వీస్ ఛార్జీల బకాయిలు ఓ వైపు వందల కోట్లలో పేరుకుపోతున్నా కేంద్ర సర్కారు కనీసం నిధులు మంజూరు చేయడం లేదు. మరోవైపు కొత్తగా ఏర్పడిన రాష్ట్ర సర్కారు సైతం బోర్డుకు రావాల్సిన సుమారు రూ.50 కోట్లను విడుదల చేయకపోగా, మీన మేషాలు లెక్కిస్తుంది. దీంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో స్వయం ప్రతిపత్తిన కొనసాగే కంటోన్మెంట్ బోర్డు వివిధ ఆదాయ మార్గాల ద్వారా సమకూర్చుకుంటున్న నిధులతో పాటు కేంద్రం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమీషన్ డబ్బులతోనే బోర్డు పరిధిలో పనులు చేపడుతుంది. బోర్డు ఆర్థిక పరిస్థితులు నానాటికీ దిగజారుతున్న తరుణంలో ఎప్పటికప్పుడు టీపీటీ, ఎంటర్‌టైన్‌మెంట్, ప్రొఫెషనల్ పన్నులను చెల్లించాలని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే పలుమార్లు లేఖలు రాసినప్పటికీ స్పందించకపోవడం గమనార్హం.

### ఆర్థికపరమైన ఇబ్బందులెన్నో..



రాష్ట్ర సర్కారు నూతనంగా ఎన్నికైన నాటి నుంచి టీపీటీ ఛార్జీల విడుదల విషయంలో ఆలస్యం జరుగుతుంది. దీంతో బోర్డు ఖాతాలో నిధులు లేని కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే ఈ విషయాన్ని రాష్ట్ర సర్కారు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సర్కారు నుంచి సుమారు రూ.50 కోట్ల మేర టీపీటీ బకాయిలు రావాల్సి ఉంది.

– మధుకర్ నాయక్, సీఈఓ, కంటోన్మెంట్ బోర్డు

### మంత్రి సీతక్కపై ఆరోపణలు సరికాదు



సాగబోయిన పాపారావు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 21: ఆదివాసీ ఆడబిడ్డ, మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బుధవారం ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సాగబోయిన పాపారావు అన్నారు. ఆమె రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క అవినీతి మచ్చ కూడా ఆమెపై లేదని గుర్తు చేశారు. ఆమెపై కావాలనే కొంతమంది పనిగట్టుకుని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.

### నేడు తిరుమలగిరిలో ఉచిత వైద్య శిబిరం

బొల్లారం,ఫిబ్రవరి 21:మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 22న కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి పెద్ద కమేళా లాలామియా బస్తీలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో జనరల్, ఆర్థో, గైనిక్, దంత, ఆప్తమిక్ వంటి సంబంధిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి,మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




**నగర ప్రజలకు నరకం**

తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పండుగ మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ బస్సులన్నీ వనజాతరకు బయలుదేరాయి. అయితే జీహెచ్‌ఎంసీ పరిధిలో బస్సులు లేకపోవడంతో రోజూ కార్యాలయాలు, కళాశాలలకు వెళ్లే వారు నరకం అనుభవిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి నాగోల్‌కు వెళ్లే దారిలో బస్సుల కోసం కిక్కిరిసిపోయి ఎదురుచూస్తున్నారు. అదే అదనుగా ఆటో డ్రైవర్లు అందిన కాడికి చార్జీలు వసులు చేస్తున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







### జూబ్లీ బస్ స్టేషన్ నుంచి మేడారంకు..

అతిపెద్ద వన జాతర మేడారంకు భక్తులు పోటెత్తారు. దానిలో భాగంగా బుధవారం జూబ్లీ బస్ స్టేషన్ నుంచి ముల్లె మూటలు సర్దుకొని నగర భక్తులు తరలి వెళ్తున్నారు. మేడారంకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసులతో పాటు ఆర్టీసీ సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

**IN THE COURT OF HON'BLE I JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT : SECUNDERABAD.**
**O.S.No.436 of 2020**

**Between :**
State Bank of India
SME Centre, Pantry Circle, Secunderabad
Represented by its Chief Manager
....Plaintiff

**A N D**

Patanjali Chikitsalaya Rep by its Proprietor
...Defendant

To
Patanjali Chikitsalaya
Represented by its Proprietor
Ms. A. Sowmya Madhuri
H.No.12-13-418/10, Lane No.3, Street No.1, Tarnaka , Secunderabad-500017.
R/o. Plot No.14, Chinnathokota, Hanumannagar, New Bowenpalli, Secunderabad.

Please take notice that the above named Plaintiff filed suit against you for recovery of money. The Hon'ble Court posted the above case on 15-04-2024 at 10.30 a.m. for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

( BY ORDER OF THE COURT)
Sd/- **D.VIJENDRA KISHORE**
ADVOCATE
H.No.12-11-1557/3, Boudha Nagar, Main Road,Secunderabad-061.
**Cell.No.98495 60556**